
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025



కసిరెడ్డి ఖలేజా

- ఇండో-పాక్ యుద్ధంలో అసువులు బాసిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి
- ఆయన స్మృత్యర్థం ఎస్వీయూలో విగ్రహం
- 27 ఏళ్లకే కన్నుమూత

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆవరణలో ఖాకీ దుస్తులు, తిరిగిన మీసాలు, చక్కని ముక్కు, ముఖవర్చస్సుతో ఒక చిన్న విగ్రహం (హాఫ్ బాడీ) కనిపిస్తుంటుంది. యూనివర్సిటీలో ఇలాంటి విగ్రహం ఎందుకు ఉందా? అని కొందరికి సందేహం కలగవచ్చు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి కసిరెడ్డి బలరాం రెడ్డి సేవలకు గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహం అది. అది 1965. భారత్-పాకిస్తాన్ సరిహద్దు వద్ద జరిగిన చిన్నతగాదాలు తారాస్థాయికి చేరుకోవడంతో ఇండో-పాక్ యుద్ధం జరిగింది. దీనినే రెండవ కాశ్మీర్ యుద్ధం అని కూడా పిలుస్తారు. ఆ యుద్ధంలో ఓ బెటాలియన్‌కు ఫార్వార్డ్ ఆఫీసర్‌గా ముందుండి నిలిచిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి వీరమరణం పొందారు.అతడే కసిరెడ్డి బలరామ్ రెడ్డి. ఆదివారం రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఎస్వీయూ విద్యార్థిగా ఆయన వ్యక్తిత్వం, కుటుంబ నేపథ్యం, చనిపోయిన అనంతరం ప్రముఖుల సంతాప సందేశాలను ఎస్వీయూ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ కె.నీలకంఠం రాసిన మెమొరీస్ ఆధారంగా ప్రత్యేక కథనం.. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇదీ కసిరెడ్డి నేపథ్యం


కసిరెడ్డి నరసారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు 1938 డిసెంబరు 2న కడప జిల్లా రాజంపేట సమీపంలోని కొండపల్లి గ్రామంలో జన్మించారు. కసిరెడ్డి వంశీయులకు స్థానికంగా మంచి గుర్తింపు ఉంది. రాజంపేట, మదనపల్లిలో ప్రాథమికోన్నత విద్యను పూర్తి చేసి, తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చేరారు. అనంతరం ఎస్వీ యూనివర్సిటీలో పీజీ (ఎకనామిక్స్)లో చేరారు. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని నిర్ణయించుకుని 1963లో పీజీ విద్యను మధ్యలోనే వదిలిపెట్టి ఆర్మీలో చేరారు. విద్యార్థి దశలో అన్ని రకాల క్రీడల్లో బాగా రాణించేవారు.ఎన్సీసీ సభ్యుడిగా యువ నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారు. త్యాగశీల స్వభావం, చక్కని శరీరదారుఢ్యంతో కలుపుగోలుతనం కలిగిన వ్యక్తి.



ఇటీవల తిరుపతికి వచ్చిన కసిరెడ్డి కుటుంబ సభ్యులు ఎస్వీయూలోని ఆయన విగ్రహం ముందు తీసుకున్న ఫొటో

బలరాముడికి బాల్యం నుంచే వైమానిక దళం లేదా సైన్యంలో ఉన్నత స్థాయి అధికారి కావాలనే గొప్ప ఆశయం ఉండేది. ఆర్మీలో కమిషన్డ్ అధికారిగా చేరిన అనతికాలంలోనే అతని ధైర్యసాహసాలను ఉన్నతాధికారులు పసిగట్టారు. డియోలాలి కంటోన్మెంట్ లెఫ్టినెంట్‌గా 1964 జనవరిలో బాధ్యతలు స్వీకరించారు. ఆర్మీలోని సురక్షితమైన సరఫరా విభాగంలో చేరితే భద్రత ఉంటుందని కుటుంబ సభ్యులు, మిత్రులు చెప్పినా వినిపించుకోలేదు. యుద్ధ రంగంలో ఉండాలనే ఉద్దేశంతోనే సాహసోపేతమైన నిర్ణయాన్ని ఎంచుకున్నారు. మాతృదేశానికి సేవ చేయడానికి అవసరమైతే ప్రాణాలను త్యాగం చేయడానికి కూడా వెనకాడనని చెప్పేవారు. 1965 సెప్టెంబరు 22న ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌తో ఫార్వర్డ్ అబ్జర్వేషన్ ఆఫీసర్‌గా వెళ్లారు. అప్పుడు జరిగిన భారత్-పాక్ యుద్ధంలో షెల్ స్ప్లింటర్ తగిలి అక్కడే వీరమరణం పొందారు. కేబీ రెడ్డి అతిచిన్నవయస్సులో చనిపోవడం బాధాకరమని, అయితే దేశంకోసం త్యాగం చేయడం గొప్ప విషయమని అప్పటి ప్రముఖులు వారి సంతాప సందేశాల ద్వారా నివాళులు అర్పించారు.

ముక్కంటి ఆలయ సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు



శివయ్యా.. స్వర్ణమ్మను చెరబడుతున్నారు

ముక్కంటి ఆలయానికి కూత వేటు దూరంలోనే విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

శ్రీకాళహస్తి - ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు.. : ఆగస్త్య మహాముని తపోశక్తితో శివయ్య సన్నిధిని తాకుతూ ఉత్తర వాహినిగా స్వర్ణముఖి నది ఉద్భవించిందని పురాణాలు చెబుతున్నాయి. ఆలయ నిర్మాణ సమయంలో పనిచేసిన కార్మికులు స్వర్ణముఖి నదిలో స్నానమాచరించి ఇసుకలో వెతికితే శ్రమకు తగిన బంగారం శివానుగ్రహంగా లభించేదని పెద్దలు కథలుగా చెబుతారు.

ఇప్పుడు.. : స్వర్ణమ్మను చెరబట్టి ఇష్టానుసారం తవ్వి, ఇసుకను పిండి కాసులుగా మలచుకుంటున్నారు ఇసుకాసురులు. శివయ్య గుడిని ఒరుసుకుని పారే ఏటిని గుల్ల చేస్తున్నారు.

బొజ్జల దూరదృష్టి : శ్రీకాళహస్తి ప్రజలు, భక్తులు స్వర్ణముఖి నదిని పవిత్రంగా భావిస్తారు. ఆ పవిత్రతను కాపాడుకోవడం బాధ్యతగా భావించిన అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దూరదృష్టితో ఆలోచించారు. పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ప్రకటించి, 25ఏళ్ల క్రితం కఠినంగా ఆంక్షలు అమలుచేశారు. నదిలోకి ట్రాక్టర్లు దిగకుండా కట్టుదిట్టం చేశారు. అయితే మధ్యలో ఎద్దుల బండి ద్వారా కొందరు ప్రవేశించి ఇసుకను సేకరించేవారు. 2015లో మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రామసేతు వంతెన పక్కన, మరి కొన్ని చోట్ల నదిలోకి ఎడ్ల బండి సైతం వెళ్లే వీలు కుండా ట్రెంచ్‌లు తీయించారు. దీంతో పట్టణ శివారులో ఎడ్లబండ్ల వారు ఇసుక సేకరించుకునేవారు.

వైసీపీ వారి అగడాలు

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి తారుమారైంది. స్వర్ణముఖి కరకట్ట మరమ్మతుల పేరుతో రామసేతు వంతెన వద్ద నదిలోకి బాటలు వేశారు. దాంతో ఎడ్లబండ్లతో ఇష్టానుసారంగా పట్టణ పరిధిలోనే ఇసుకను తవ్వేయడం మొదలు పెట్టారు. ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో రెండేళ్ల క్రితం మళ్లీ ఎడ్లబండ్లను సైతం కట్టడి చేశారు.

మళ్లీ మొదలైంది..

తాజాగా ఇసుకాసురులు శ్రీకాళహస్తిలో డంపులు ఏర్పాటు చేసుకోవడం.. చెన్నై రెడ్‌హిల్స్‌కు తరలించడం మొదలుపెట్టారు. తమ తవ్వకాల దుకాణాన్ని ఏకంగా పట్టణ నడిబొడ్డులోని ముక్కంటి ఆలయం వద్దనే తెరిచారు. ఇదేం బరితెగింపు అని ప్రశ్నించిన స్థానికులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. సుమారు 25 ఏళ్లనుంచి పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలోకి ఇసుక ట్రాక్టర్లు దిగలేదు. ప్రస్తుతం ఏకంగా ముక్కంటి ఆలయ సమీపంలోనే ఈ దురాగతం జరగడం చూస్తున్న ప్రజలంతా నివ్వెరపోతున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులతో కలిసి సాగిస్తున్న పాపాలు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయి.



ఇది మరీ దారుణం

ఇటీవల తొట్టంబేడు మండలం ఎల్ఐసీ కాలనీలో ఓ వ్యక్తి పాత ఇంటిని తొలగించి స్థలాన్ని చదును చేసుకున్నాడు. అక్కడ కొత్తగా నిర్మాణం చేసుకునేందుకు ఇసుకను తోలిపెట్టుకున్నాడు. యజమాని నెల్లూరు ఆస్పత్రికి వెళ్లిన సమయంలో దానిని అక్రమ ఇసుక డంపుగా అధికారులు సీజ్ చేశారు. రెండు రోజుల తర్వాత ఈ ఇసుకను వేలం ద్వారా వేరొకరికి కట్టబెట్టారు. ఇక అడిగేవారే లేరన్నట్లుగా పట్టపగలు ప్రైవేటు ఇంటి యజమాని తోలుకున్న ఇసుకను ట్రాక్టర్లతో తొలగించే ప్రయత్నం చేశారు. ఇరుగు పొరుగు వారి నుంచి సమాచారం తెలుసుకున్న బాధితుడు పరుగుపరుగున ఇంటి వద్దకు చేరుకున్నాడు. తన ఇసుకను ఎందుకు తీసుకెళుతున్నారని ప్రశ్నించడంతో అధికారులు తమకు వేలం ద్వారా అమ్మేశారని ఎదురుదాడికి దిగారు. బాధితుడు రెవెన్యూ అధికారులను గట్టిగా నిలదీసి తన ఇసుకను కనీస సమాచారం లేకుండా ఎలా అమ్మేస్తారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా బాధితుడితో రాజీ కుదుర్చుకున్నారు.

అంతా అధికార మాయ

పట్టణంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు అధికారుల చిత్తశుద్ధిని శంకిస్తున్నాయి. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా 200 మీటర్ల దూరంలో ఒకసారి, ఇదే పోలీస్‌స్టేషన్‌కు తూర్పు వైపున 500మీటర్ల దూరంలో మరోసారి భారీ ఇసుక డంపులు వెలుగు చూశాయి. పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఇసుక డంప్‌లను విజిలెన్సు అధికారులు సీజ్ చేశారు. ఇక రెండు నెలల క్రితం తొట్టంబేడు గ్రామం చెన్నై రోడ్డు పక్కన ఉన్న ఓ ప్రైవేటు పెట్రోల్ బంకు వెనుక ఒక డంప్, ఇక్కడికి సమీపంలో సమ్మర్‌స్టోరేజీ వద్ద ఒక డంపు, పట్టణ శివారులోని గ్యాస్ గోదాము సమీపంలో మరో డంపు ఒకే రోజున సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. తొట్టంబేడు రెవెన్యూ అధికారులు పెట్రోల్ బంకు వెనుక వైపు ఉన్న డంప్‌ను మాత్రమే సీజ్ చేసి, మిగతా రెండింటి జోలికి వెళ్లలేదు. ఈలోగా అక్రమార్కులు రాత్రికి రాత్రి తరలించేశారు. పెట్రోల్ బంకు వెనుకనే సీజ్ చేసిన డంప్ యజమాని ఎవరు.. అసలు ఆ భూమి ఎవరిది అన్న వివరాలను బహిర్గతం చేయకుండా తూతూమంత్రంగా సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు.



ముస్తాబైన తిరుపతి విమానాశ్రయం

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- పోలీసు పెరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25: 76 గణతంత్ర వేడుకలకు తిరుపతిలోని పోలీస్ పెరేడ్ మైదానం ముస్తాబైంది. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. జిల్లా ప్రగతిపై సందేశమిస్తారు. ఉత్తమ సేవలందించిన జిల్లాలోని 479మంది ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. 9.50 గంటలకు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

మైదానం ముస్తాబు

గణతంత్ర వేడుకలను పరేడ్ మైదానాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి పది స్టాల్స్ ఏర్పాటు చేశారు. పరిశ్రమలు, వ్యవసాయం, హార్టికల్చర్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ, పర్యాటకం, విద్యాశాఖ, మున్సిపల్ కార్పొరేషన్, నెడ్‌క్యాప్, పోలీసు, చేనేత శాఖలకు సంబంధించిన శకటాలు సిద్ధం చేశారు. మువ్వన్నెల రంగుల విద్యుత్ కాంతులతో కలెక్టరేట్ భవనం ముస్తాబైంది. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామ్మోహన్, డ్వామా,డీఆర్‌డీఏ పీడీలు శ్రీనివాసప్రసాద్, శోభన్‌బాబు శనివారం ఏర్పాట్లను పరి శీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



రంగులు అద్దుతున్న కార్మికులు

ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు అందుకున్న కలెక్టర్





అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మి

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వెంకటేశ్వర్ పురస్కారం అందుకున్నారు. వెంకటగిరి అసెంబ్లీ ఈఆర్వో సుధారాణి, తిరుపతి అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మి, బీఎల్వోలు జ్యోతి, పార్వతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ పవన్‌కుమార్ కూడా పురస్కారాలు అందుకున్నారు.





శ్రీకాళి సేవలో నితిన్.. తిరుమలలో శ్రీముఖి

సినీ హీరో నితిన్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నటి శ్రీముఖి రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం స్వామి వారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



సదస్సును ప్రారంభిస్తున్న సుభాష్ పాలేకర్, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- పద్మశ్రీ సుభాష్ పాలేకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యం మెరుగవుతుందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుభాష్ పాలేకర్ అన్నారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సహజ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా మనిషి ఆరోగ్యానికే కాకుండా, పర్యావరణానికీ మేలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అధిక దిగుబడి ఆశతో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగిందని, దీనివల్ల మనిషికి షుగర్, గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వస్తున్నాయని తెలిపారు. భూమాతను కలుషితం చేసే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు ప్రకృతి వ్యవసాయాన్ని అనివార్యం చేస్తాయని స్పష్టం చేశారు. మన దేశ వ్యవసాయ విధానాన్ని సహజత్వం వైపు నడిపించడమే తన లక్ష్యమన్నారు. యువత సాంకేతిక విజ్ఞానంతో పాటు వ్యవసాయ రంగంపై శ్రద్ధ వహించాలన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు వ్యవసాయం గురించి తెలియజేయాలని కోరారు. ఏ రంగమైనా చివరకు భూమి చుట్టూనే తిరగాల్సి ఉంటుందని, అందుకే దాన్ని కలుషితం చేయకుండా ప్రకృతి సహజంగా వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని కోరారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ యువత, విద్యార్థులు వ్యవసాయం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఇందులో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతినాయుడు, డీఎఫ్‌వో వివేక్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మద్యం, మాంసం దుకాణాల బంద్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని మద్యం, మాంసం దుకాణాలు మూసివేయనున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని 227 మద్యం దుకాణాలు, బార్లకు సీల్ వేశారు. సోమవారం ఉదయం వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి హెచ్చరించారు.

వి-హబ్ ఎంబీయూ బృందం ప్రతిభ


బృందాన్ని అభినందిస్తున్న ఎంబీయూ సిబ్బంది

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వి-హబ్ బృందం రూపొందించిన వినూత్న కెరీర్ మార్గదర్శక ప్రాజెక్ట్ 'వాట్స్ నెక్ట్' అన్వేషణ చిత్తూరు ప్రాంతీయ పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. మోక్షిత్, సంతోష్, దీక్షిత్, శిరీష్‌ల బృందానికి వి-హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.విష్ణు వర్ధన్‌నాయుడు మెంటార్‌గా వ్యవహరించారు. ఈనెల 23, 24 తేదీల్లో కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో జరిగిన తుది పోటీల్లో వీహబ్ ప్రాజెక్ట్ బృందానికి రూ.15 వేల నగదు బహుమతి లభించింది. రాష్ట్రస్థాయి రౌండ్‌కు ఎంపికైంది. వాట్స్ నెక్ట్ మరింత మందిలో ప్రేరణ నింపుతుందని వర్సిటీ అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులను సన్మానించారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించిరు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి పాల్గొన్నారు.

28 నుంచి పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు

తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు ఆస్థానమండపంలో నిర్వహించనున్నారు. మొదటిరోజు సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు, పురందర సాహిత్య గోష్ఠి, వివిధ పీఠాధిపతుల మంగళాశాసనాలు, మధ్యాహ్నం సంకీర్తనమాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు ప్రముఖ పీఠాధిపతులు మంగళా శాసనాలు అందించనున్నారు. 29న ఉదయం 6 గంటలకు అలిపిరి వద్ద పురందరదాసు విగ్రహానికి పుష్పమాల సమర్పిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు. చివరిరోజు సుప్రభాతం, ధాన్యం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కౌస్తుభంలో పనిచేయని లిఫ్ట్: భక్తుల పాట్లు



తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్య భక్తులు బస చేసే ప్రధాన విశ్రాంతి గృహమైన కౌస్తుభంలో శనివారం లిఫ్ట్ మొరాయించింది. ఐదు అంతస్థుల భవనంలో మూడు లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. రెండురోజుల క్రితం ప్రధాన ద్వారం వద లిఫ్ట్ మరమ్మతులకు గురైంది. దీంతో ఒక్క లిఫ్ట్‌పైనే భక్తులందరూ ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నడవలేని వృద్ధులు, ఆరోగ్య సమస్యలున్నవారు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు లిఫ్ట్ కోసం కూడా నిరీక్షించాల్సి వస్తోంది. లగేజీతో పైఅంతస్థులకు చేరుకునేందుకు ఆగచాట్లు పడుతున్నారు.

చరిత్రాత్మక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ పర్యాటకదినోత్సవం సందర్భంగా శనివారం ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు చంద్రగిరి నుంచి కోట వరకు ర్యాలీ నిర్వహించారు. మండల విద్యా శాఖ అధికారి ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ చారితాత్మక ప్రదేశాలపై విద్యార్థులకు అవగహన అవసరమన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

తిరుమలలో మతి స్థిమితంలేని వ్యక్తి వీరంగం

తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం సృష్టించాడు. బాలాజీనగర్‌లోని స్థానికులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి శనివారం రాత్రి బాలాజీనగర్‌లోకి ప్రవేశించాడు. ఓ ఇంట్లోకి ప్రవేశించి మహిళపై దాడి చేశాడు. మరో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు చేరుకోగా అక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత రింగురోడ్డులో కర్రలతో వాహనదారులపై దాడికి ప్రయత్నించాడు. బాలాజీనగర్ వాసులు రింగురోడ్డులో అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వరాహస్వామి దర్శనానికి అడ్డగోలుగా అనుమతి


ఆలయం ముందు గేటు ద్వారా వెళుతున్న భక్తులు

తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వరాహస్వామి దర్శనానికి కూడా క్యూలైన్లలో బారులు తీరాల్సి వస్తోంది. మూడువరుసల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి గంటల కొద్ది నిరీక్షించాక వరాహస్వామిని దర్శించుకోవాల్సి వస్తోంది. కొంతకాలంగా వరాహస్వామి ఆలయం ద్వారం ముందున్న గేటు సిబ్బంది అడ్డదారిలో కొందరిని ఇష్టానుసారం దర్శనానికి అనుమతిస్తున్నారు. 'మనోళ్లే.. పంపించు' అంటూ అక్కడ విధుల్లోని సిబ్బందికి కొందరు చెప్పడం, క్యూలైన్‌లోని భక్తులను పట్టించుకోకుండా గేట్లు తెరిచి అడ్డదారిలో అనుమతించడం అలవాటుగా మారిపోయింది. దీంతో క్యూలైన్లలో భక్తులకు మరింత సమయం పడుతోంది.

పూర్వ విద్యార్థి రూ.40 లక్షల విరాళం


భూమి పూజ చేస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, హైదరాబాదుకు ఎందిన జీఆర్ పవర్ స్విచ్ గేర్ సంస్థ అధినేత సి. గోపాలరెడ్డి రూ.40 లక్షల విరాళాన్ని ప్రకటించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్ మెస్, వంటశాల, భోజనశాల నిర్మాణానికి ఈ విరాళాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన భూమి పూజను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వర్సిటీ, కాలేజీ, హాస్టల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు డాక్టరేట్



తిరుపతి (జీవకోన), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఆఫ్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ బెంగళూరు నుంచి ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ శనివారం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ డాక్టరేట్ అందుకున్నారు. ఆదర్శ మహిళా ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు ఆమెకు యూనివర్శిటీ డాక్టరేట్‌ను అందించింది.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తాం



తిరుపతి (జీవకోన), జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సామంచి శ్రీనివాస్ నవీన్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు.

రహదారి భద్రతపై అవగాహన

తిరుపతిరూరల్, జనవరి25(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టీసీ హెవీ మోటార్ వాహనాల డ్రైవర్లు, ఇంజినీరింగ్ కళాశాలల బస్సు డ్రైవర్లకు శనివారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌టీవో మురళీ మోహన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే టప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ఎంవీఐలు, అన్నమాచార్య, శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలల, అకార్డ్, ఎడిఫై స్కూళ్ల డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ కారు



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25: తిరుపతి నగర శివారులోని దామినేడు సమీపంలో ఉన్న హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కారు షోరూంలో శనివారం కియా సిరోస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. డీటీవో మురళీమోహన్ కారును ఆవిష్కరించారు. షోరూం నిర్వాహకులు జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా సిరోస్ కారు అత్యాధునిక హంగులు, టెక్నాలజీతో రూపొందించారన్నారు. డైరెక్టర్లు నిరంజన్, భారతి, హోషిమారెడ్డి, మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి


ఆకట్టుకుంటున్న చిత్రరత్నాలు

భళా.. మహిళల కళాసృజన



● ఆకట్టుకున్న ఉమెన్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ● నేటితో ముగియనున్న ప్రదర్శన



చిత్రాలను పరిశీలిస్తున్న అతిథులు - ఎగ్జిబిషన్‌లో చిత్రాలను ప్రదర్శించిన చిత్రకారులు

ఉమెన్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో విలువైన చిత్ర కళారాజాలు కొలువు దీరాయి. పద్మావతి చిత్రాలయం ఆధ్వర్యంలో ఎనిమిదిమంది మహిళా చిత్రకారులు రూపొందించిన చిత్రాల ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనకు తిరుపతి బస్టాండు సమీపంలోని హోటల్ ఉదయీ ఇంటర్నేషనల్ వేదికైంది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దుర్గాభవాని, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, జనసేన నేత కిరణ్ రాయల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ఊహలకు రంగులద్దడం సృజనాత్మకతతో కూడుకున్న కళ అన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతల్లో ఉంటూనే చిత్రకారులుగా రాణించడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ దుర్గాభవాని మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిలో కళాభిరుచి మానసిక ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఆర్ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇందులో ప్రకృతి, మనిషికి సంబంధించిన సకల హావ భావాలను చిత్రాలుగా గీశారన్నారు. జనసేన నేత కిరణ్‌రాయల్ మాట్లాడుతూ.. చిత్రకళలో రాణిస్తున్న మహిళా కళాకారులను అభినందించారు.



వెల్లివిరిసిన ప్రకృతి సోయగాలు

ప్రకృతిలోని అనేక అంశాలకు కుంచెతో రంగులద్ది ఔరా అనిపించిన వివిధ చిత్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. చిత్రకారులు కిరణకుమారి, బత్తుల అర్చన, జి. గాయత్రిదేవి, రాగిమాను శ్రీదేవి, జానకి, ఊర్మిళ, సాయిదివ్య, లావణ్య రూపొందించిన చిత్రాలు అబ్బురపరిచాయి. మహిళా చిత్రకారులు నగరంలో చిత్రాల ప్రదర్శన నిర్వహించడం ఇదే తొలిసారి.ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా చేపట్టడంతో మంచి స్పందన వస్తోంది. తొలి రోజు పెద్ద సంఖ్యలో సందర్శకులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆదివారం సాయంత్రంతో ప్రదర్శన ముగియనుంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ద్వారక బద్రికాశ్రం మఠాధిపతి విద్యానారాయణ తీర్థ స్వామిజీ, ,ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కల్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఉన్నారు.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన రెండు వాహనాలు


31వ మలుపు వద్ద ప్రమాదానికి గురైన కారు

తిరుమల, జనవరి25(ఆంధ్రజ్యోతి): మొదటిఘాట్‌రోడ్డులో శనివారం వేకువజామున ఓ కారు అదుపుతప్పి గుంతలోకి దూసుకుపోయింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని వేకువజాము తిరుమల నుంచికారులో తిరుగు ప్రయాణమయ్యారు. 31వ మలుపు వద్ద ఓ కల్వర్టు దిమ్మెను ఢీకొట్టడంతో కారు అదుపుతప్పి కాలువ గుంతలోకి దూసుకుపోయింది. కారులోని భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ఏనుగుల ఆర్చ్ వద్ద మరో స్కార్పియో కారు కూడా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలోని చెన్నైకు చెందిన నలుగురికి చిన్నపాటి గాయాలయ్యాయి.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో ఇరువరాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాసమంగాపురానికి చెందిన పవన్‌కు, నరసింగాపురానికి చెందిన గౌరీశంకర్‌లకు పాత గొడవలున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మద్యం దుకాణం వద్ద గొడవ జరిగింది. అనంతరం గౌరీశంకర్ వర్గీయులు పవన్‌పై రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. దాడుల్లో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఎర్ర' చందనం నిందితుడి జామీనుదారులకు జరిమానా

తిరుపతి(మంగళం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ నిందితునికి జామీను ఇచ్చిన ఇద్దరు వ్యక్తులకు ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు రూ.25 వేల జరిమానా విధించింది. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఈవిషయం తెలిపారు. 2017లో తమిళనాడుకు చెందిన ఎ.వెల్లికన్నన్ అనే నిందితునికి ఎర్రావారిపాలెంకు చెందిన ఎం.గోబ్రినాయక్, ఎం.శ్రీరాములు నాయక్ జామీను ఇచ్చారు. కోర్టుకు నిందితులు హాజరు కాకపోవడంతో శనివారం ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు జామిన్ ఇచ్చిన ఇద్దరికీ రూ.25 వేల చొప్పున జరిమానా విధించందన్నారు.

పీఆర్‌సీ అమలుచేయాలి

ఎర్రావారిపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట కౌన్సిలర్ సదాశివరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్సీని అమలుచేసి కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలన్నారు. డీఏలు,బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐలు పోలీస్ శాఖ ఉద్యోగులకు మాత్రమే ఇవ్వడంలో మర్మమేమిటని ప్రశ్నించారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల: వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఓటుతో సమర్థ పాలకులను ఎన్నుకోవాలి: ఆర్డీవో


చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మానవహారం

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాయుధమైన ఓటు హక్కు సద్వినియోగంతో సమర్థవంతమైన పాలకులకు ఎన్నుకోవాలని ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీని ఆర్డీవో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనతరం టవర్ క్లాక్ వద్ద. మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా ఆర్డీవో రామ్మోహన్ మాట్లాడారు. ఓటు హక్కుపై నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎక్కువసార్లు ఓటేసిన సిటిజన్స్‌ను బాలుర ఉన్నత పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ సుమన్, ఎంపీడీవో శేఖర్, డీటీలు దివాకర్, మహేశ్వరి, ఆర్ఐ సులోచన తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఆర్‌సీపురంలో సీనియర్ సిటిజెన్లను సన్మానించారు. తహసీల్దారు కార్యాలయం నుంచి విద్యార్థులు, విద్యాశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు వెంకటరమణ, డీటీ అన్వర్‌బాషా,ఎంపీడీవో ఇందిరమ్మ, ఎస్ఐ రామాంజనేయులు, ఎంఈవో మార్కండేయనాయుడు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: మండల కేంద్రంతో పాటు కమళ్ళయ్యగారిపల్లె పంచాయతీ పచ్చార్లపల్లెలో అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ పరమేశ్వర స్వామి, ఎంఈవో బాల సుబ్రమణ్యం,సతీస్‌బాబు పాల్గొన్నారు. **పాకాల:** డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, తహశీల్దార్ సంతోష్‌సాయి,తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి బ్రాహ్మణవీధిలో చోరీ

● 40 గ్రాముల బంగారు, రూ.15 వేల అపహరణ


ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు బ్రాహ్మణ వీధికి చెందిన్న వెంకట అప్పయ్యశాస్త్రి కుటుంబం ఈనెల 17న అన్నవరం వెళ్లింది. ఈనెల 22న తిరుపతికి చేరుకుని కుమార్తె ఇంట్లో ఉన్నారు. శనివారం ఉదయం చంద్రగిరిలోని తమ ఇంటికి వచ్చారు. తలుపులు, తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని అప్పయ్యశాస్త్రి గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. బీరువాలో 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలి కుటుంబానికి టీటీడీ రూ.27 లక్షల పరిహారం


విరాళం చెక్‌ను అందజేస్తున్న బోర్డు సభ్యులు

తిరుమల, జ నవరి25(ఆంధ్రజ్యోతి): తి రుపతిలో ఈనెల 8న వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన కేరళ పాలక్కాడ్‌కు చెందిన నిర్మల కుటుంబానికి రూ.27 లక్షల పరిహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు శనివారం అందజేశారు. టీటీడీ బోర్డు తీర్మానం మేరకు రూ.25 లక్షలు, సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులు రూ.2 లక్షలు కలిపి రూ.27 లక్షలు అందజేశారు. మృతురాలు నిర్మల ఏకైక కుమార్తె కైశిగాకు పరిహారం చెక్‌ను బోర్డు సభ్యులు నరేష్‌కుమార్, రామ్మూర్తి, శాంతారాం అందజేసి పరామర్శించారు.

సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాలి : కాంగ్రెస్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కలెక్టరేట్ వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలు గరిటెతో పళ్లాలు వాయిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలోడీసీసీ ప్రెసిడెంట్ బాలగురవంబాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నరసింహులు, మురళి, ప్రేమ్‌కుమార్, సురేష్‌బాబు, అర్జున, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేగుంటను పరిరక్షించండి

తిరుపతిరూరల్, జనవరి25(ఆంధ్రజ్యోతి): అవిలాల గ్రామపంచాయతీ పరిధిలోని చేనేగుంట ఆక్రమణలకు గురవుతోందని, సర్వేచేసి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. తిరుపతిరూరల్ మండల అవిలాల గ్రామంలో సర్పంచ్ చెందిలి వెంకటరమణ అధ్యక్షతన శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ రేషన్ బియ్యం కనీసం ఐదు రోజులైనా ఇవ్వాలని, పాతపంచాయతీ కార్యాలయాన్ని మహిళా సమాఖ్య కోసం కేటాయించాలని, కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలని, గణపతి లేఅవుట్‌లో సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యదర్శి శ్రీలేఖ మాట్లాడుతూ చేనెగుంట హద్దులు నిర్ధారించిన తర్వాత తుడా నిధులతో వాకింగ్ ట్రాక్, పార్క్ ఏర్పాటు చేసేలా కృషిచేస్తామని తెలిపారు. పంచాయతీలో రోడ్లు, డ్రైన్స్ వంటి అభివృద్ధి కోసం రూ.3కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని వివరించారు. ఎంపీటీసీ హరికృష్ణారెడ్డి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సాంబశివయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

తిరుపతి(వైద్యం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు, విద్యార్థులకు చేసే ఆరోగ్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఇందిరానగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, మున్సిపల్ పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. అక్కడ చిన్నారులకు, విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. డాక్టర్లు పద్మావతి, క్రాంతి, గుణశేఖర్, సిబ్బంది సుగుణ, లక్ష్మీకళ తదితరులు పాల్గొన్నారు.

జ్వర సర్వే పరిశీలన


విద్యార్థులను పరీక్షిస్తున్న బాలకృష్ణనాయక్

చంద్రగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాయలపురంలో ఫీవర్, లార్వా సర్వేల తీరును శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్, ఓవర్ హెడ్ ట్యాంకు క్లీనింగ్, క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ, రత్నాకర్, వైద్య సిబ్బంది ఈశ్వరయ్య,ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి

పాకాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ కోరారు. స్థానిక సీఐటీయూ భవనంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు మధూసూదన్‌రావ్ అధ్యక్షతన శనివారం కార్మికులు సమావేశం నిర్వహించారు. లక్ష్మీ మాట్లాడుతూ కార్మికులకు రూ.26 వేల జీతం ఇవ్వాలని, ప్రతినెల 5లోపు చెల్లించాలని కోరారు. సంఘం అధ్యక్షురాలిగా రాజేశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలిగా వాణి, కార్యదర్శిగా సైఫాభాను. కోశాధికారిగా ధనమ్మలను ఎన్నుకున్నారు.

కోడిపందెం జూదర్ల అరెస్టు

ఎర్రావారిపాలెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉదయమాణిక్యం పంచాయతీ రెడివారిపల్లెకు సమీపంలో కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. వారి నుండి రూ.1750 నగదు, పందె పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

శక్తిపీఠంలో నాగసాధువులు

రామచంద్రాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తిపీఠంలోని మరకత శక్తికాళీ అమ్మవారిని 15మంది నాగ సాధువులు(వారణాశి) శనివారం దర్శించుకున్నారు. పీఠం నిర్వాహకులు వీరికి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు.

పశువైద్య శిబిరానికి స్పందన

తిరుపతిరూరల్, జనవరి25(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్‌మండలం పుదిపట్ల గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరాన్ని సర్పంచ్ బడి సుధాయాదవ్ ప్రారంభించారు.

రోజా వ్యాఖ్యలపై స్పందించడం సమయం వృథా
ఎమ్మెల్యే భానుప్రకాష్

తిరుపతి అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఏం మాట్లాడుతుందో కూడా తెలియకుండా మాట్లాడే రోజా వ్యాఖ్యలపై మాట్లాడటం సమయం వృథా అంటూ నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ ఎద్దేవా చేశారు. శనివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ జగన్ లీడర్‌షిప్‌పై నమ్మకం లేకనే విజయసాయిరెడ్డి వైసీపీకి రాజీనామా చేశారని భావిస్తున్నామన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. అమరావతి, పోలవరం అభివృద్ధి చెందకూడదని ఆ పార్టీ నేతలు లెటర్లు పెడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ఏపీ అన్ని విషయాల్లో వైఫల్యం చెందిందని నీతి అయోగ్ వెల్లడించిందన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు తాపత్రయ పడుతున్నారని, పెట్టుబడులను ఆకర్షించడానికి దావోస్‌కు ముఖ్యమంత్రి బృందం వెళ్లిందని అన్నారు.

హ్యుండాయ్ న్యూ క్రెటా ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ



తిరుపతి అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సరికొత్త హ్యుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారును శనివారం ఆవిష్కరించారు. జిల్లా రవాణాశాఖాధికారి కె.మురళీమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక ఆర్ కె హుండాయ్ షోరూం నుంచి నూతన విద్యుత్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు జి.వెంకటరమణ, జి.బాలాజీ మాట్లాడుతూ క్రెటా ఎలక్ట్రిక్ కారు అత్యధిక బ్యాటరీ కెపాసిటీ కలిగి ఉందన్నారు. ఒకసారి చార్జింగ్ పూర్తయితే 390 కిలోమీటర్లు నడుస్తుందన్నారు. అనేక ఫీచర్స్, వేరియంట్స్ కలిగివుందని, రూ.17.99లక్షల ధరతో ప్రారంభమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు, బ్యాంకర్స్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం

తిరుపతి(వైద్యం), జనవరి 25(ఆంధ్రజ్యోతి):సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఆయన శనివారం హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు.

తిరుపతి

నకిలీ ప్లాటు పత్రాలు సృష్టించి
రూ.11 లక్షల స్వాహా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): నకిలీ ప్లాటు పత్రాలు సృష్టించి వేరేవారి ప్లాటును తమ ప్లాటు చూపించి ఓ ప్రైవేటు టీచర్ నుంచి దాదాపు రూ.11 లక్షలు కాజేసిన దంపతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవికాంత్, సీమకుమారి దంపతులు. వీరు రేణిగుంట రోడ్డులో కాపురం ఉంటున్నారు. సీమకుమారి స్థానిక నారాయణ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఇదే పాఠశాలలో బైరాగిపట్టెడకు చెందిన శిరీషామాధురి టీచర్‌గా పనిచేస్తోంది. శిరీషామాధురి ప్లాటు కొనుగోలు చేయాలని స్నేహితురాలితో చెప్పింది. దీంతో సీమకుమారి దంపతులు తమకు తూకివాకం వద్ద ప్లాటు ఉందని విక్రయిస్తామని చెప్పారు. ఆమె కొనుగోలుకు ఆసక్తిచూపడంతో వేరేవారి ప్లాటును తమ ప్లాటుగా చూపించారు. నకిలీపత్రాలు సృష్టించి ఆమెకు ఇచ్చారు. రూ.11 లక్షలు తీసుకున్నారు. తర్వాత పరిశీలించగా అవి నకిలీపత్రాలని తేలడంతో మోసపోయామని గ్రహించిన శిరీషామాధురి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల వితరణ



తిరుపతి (ఆటోనగర్), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో దివ్యాంగులు, వృద్ధ ప్రయాణీకుల సౌకర్యార్థం స్పర్శ ఆస్పత్రి అధినేత డాక్టర్ హరిబాబు మూడు వీల్ చైర్లను వితరణ చేశారు. శనివారం తిరుపతి రైల్వే స్టేషన్ ప్రధాన ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీబాలాజీ రైల్వే లైసెన్స్ కూలీ పోర్టర్స్ సంఘం గౌరవాధ్యక్షులు కుప్పాల గిరిధర్‌కుమార్‌కు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు షణ్ముగరెడ్డి, ఓబులురెడ్డి, అంజనేయులు, కుమార్, గోవిందరాజులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డేకు పటిష్ట భద్రత

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జరగనున్న గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. అక్కడ రిజర్వు బలగాలు నిర్వహించిన రిహార్సల్స్‌ను తిలకించారు. జాతీయ పతాకం ఎగురవేసి, జెండా వందనం సమర్పించారు. డాగ్‌స్క్వాడ్ విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పోలీసు అధికారులు, సిబ్బందిచే ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

అనాథాశ్రమానికి నిత్యావసరాల వితరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి పద్మావతి డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థి సంఘం నిత్యావసరాలను అందజేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఈ సామగ్రిని వారు అందించారు. పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ భద్రమణి పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నగరపాలక కమిషనర్ మౌర్య కోరారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తిరుపతిలో అవగాహనా ర్యాలీ సాగింది. అనంతరం పద్మావతి యూనివర్సిటీ ఆడిటోరియంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌర్య మాట్లాడుతూ ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా మంచి భవిష్యత్తు కలుగుతుందన్నారు.

డాక్టరేట్ ప్రదానం



స్వరూపరాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ ఫార్మసీ పరిశోధకులు కె.స్వరూపారాణి డాక్టరేట్ పొందారు. 'ఆర్‌పి-హెచ్‌పీఎల్‌సీ మెథడ్ డెవెలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ యూజింగ్ క్వాలిటీ బై డిజైన్ ఫర్ ద ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ ప్యూర్ అండ్ డోసేజ్ ఫామ్స్ విత్ ఫోర్స్ డిగ్రెడేషన్ స్టడీస్' అనే అంశంపై ప్రొఫెసర్ రమ్యాకుబేర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

వైసీపీ నేతలను శిక్షించాలి : కాంగ్రెస్

తిరుపతి(వైద్యం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరినందుకు హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. స్థానిక సత్యనారాయణపురం సమీపంలో శుక్రవారం రాత్రి వైసీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలకు చెందిన చిరువ్యాపారి బాబును కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు తన స్నేహితుడి దగ్గర వైసీపీ యువజన నేత కొనిశెట్టి ప్రవీణ్‌కు కొంతనగదు అప్పుగా తీసిచ్చాడని ఆ నగదు తిరిగి అడిగినందుకు ప్రవీణ్ తన అనుచరులతో కలిసి హత్యాయత్నానికి పాల్పడటం దారుణమన్నారు.

హెచ్‌డీఎస్ సభ్యులకు డిక్లరేషన్ అందజేత

తిరుపతి(వైద్యం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి హెచ్‌డీఎస్(ఆస్పత్రి అభివృద్ధి కమిటీ) సభ్యులుగా ఎన్నికైన షేక్ ఖాజా మెహిద్దీన్, సందీప్‌లకు శనివారం రుయా సూపరింటెండెంట్ రవిప్రభ డిక్లరేషన్ పత్రాలను అందించారు. అనంతరం హెచ్‌డీఎస్ సభ్యులను ఆయన శాలువాలతో సన్మానించారు. ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు తమవంతు కృషి చేయాలని ఆయన వారిని కోరారు.

చెన్నారెడ్డి కాలనీలో దొంగలు పడ్డారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నారెడ్డి కాలనీలో శనివారం ఒక ఇంటిలో దొంగలు పడి బంగారు నగలు దోచుకెళ్లారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు... రుయా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న అరుణ శనివారం ఉదయం విధులకు వెళుతూ ఇంటి తాళాలు వేసింది. తర్వాత తాళాలు ఇంటి ముందు వున్న షూస్‌లో పెట్టి వెళ్లింది. మధ్యాహ్నం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూడగా తాళాలు తెరచి ఉండడం గమనించింది. ఇంట్లోని దాదాపు 29 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. మల్లంగుంటకు చెందిన ఈశ్వరరెడ్డి భర్తకు దూరంగా ఉంటున్న ఒక వివాహితను ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆమెకు మొదటి భర్త వలన కలిగిన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం స్థానిక బైరాగిపట్టెడలో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. అవిలాలకు చెందిన రూపేష్, జ్యోతిష్ మరో ఇద్దరు కలిసి బైరాగిపట్టెడలో ఓ చోట మద్యం తాగారు. బైరాగిపట్టెడకు చెందిన తేజ, చరణ్, మరో ఆరుగురు స్నేహితులు అక్కడకు వెళ్లారు. అందరూ కలసి పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో అవిలాలకు చెందిన రూపేష్, జ్యోతీష్‌తో పాటు మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు రూపేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పుత్తూరు వార్తలు

వజ్రాయుధంలాంటి ఓటుతో మంచిప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పుత్తూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వజ్రాయుధం లాంటి ఓటు హక్కుతో సేవా దృక్పథం గల నాయకులను ఎన్నుకోవాలని పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు నాగేశ్వరరావు, నరసింహులు, మన్యం నరసింహులు, శ్రీనివాసులు లు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి, ఓటు ప్రాధాన్యతను వివరించారు.

వడమాలపేట: వడమాలపేటలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ జరీనా, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, ఆర్ఐ జానీబాషా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

30వ తేదీలోగా ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

పుత్తూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 1, 3, 5 సెమిస్టర్లకు ఈనెల 30వ తేదీ లోగా పరీక్ష ఫీజులు చెల్లించాలని విద్యార్థులను కోఆర్డినేటర్ నరసింహులు కోరారు. మరిన్ని వివరాలకు 73829 29641, 95154 01088 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో హాసినికి ప్రథమ బహుమతి



రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన హాసిని

పుత్తూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో స్థానిక హిమజ పాఠశాల యూకేజీ విద్యార్థిని హాసిని ప్రథమ బహుమతి గెల్చుకుంది. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హిమజ సంస్థల చైర్మన్ సురేంద్ర రాజు, డైరెక్టర్ రేష్మ మాట్లాడుతూ భవిష్యత్తులో జాతీయ స్థాయి బహుమతి సాధించాలని ఆకాంక్షించారు.

పుత్తూరులో మాంసం, మద్యం విక్రయించరాదు

పుత్తూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా పుత్తూరు పట్టణ పరిధిలో ఆదివారం మాంసం, మద్యం విక్రయించరాదని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, పట్టణ సీఐ సురేంద్రనాయుడు శనివారం ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సీతారామ లక్ష్మణులు, ఆంజనేయ స్వామి వార్లకు అభిషేకం చేశారు. అగ్ని హోమం, అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. టీడీపీ నాయకులు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జరీనా

వడమాలపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులను ఎక్సైజ్ అధికారులు తొలగించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. శనివారం వడమాలపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖాధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్వీపురం రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టి, తిరుపతి నుంచి పుత్తూరు వెళ్లే ఆర్టీసీ బస్సులను వడమాలపేట మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో 108, 104 వాహనాలు రావడానికి కష్టం ఉందని డాక్టర్ చక్రపాణి తెలిపారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి విజయకుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎం.కొత్తూరు పాఠశాలలో ఉన్నతాధికారుల విచారణ





గ్రామస్తులతో, అధికారులు, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఆర్డీవో భవానీశంకరి

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలలో తలెత్తిన వివాదంపై శనివారం ఆర్డీవో భవానీశంకరి సమక్షంలో విచారణ జరిగింది. పాఠశాల సమీపంలోని మాంగాడు దళితవాడకు చెందిన కొంతమంది పిల్లలు తమ ఊరి పిల్లలను ఇళ్లవద్దకు వచ్చి మరీ కొడుతున్నారని....కాబట్టి తమ ఊరిలో అసలు స్కూలే వద్దని ఎం.కొత్తూరువాసులు శుక్రవారం పాఠశాలను మూసివేసి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో స్త్రీ, శిశుసంక్షేమ పీడీ వెంకటేశ్వరి , డీవైఈవో ప్రబాకరరాజు, ఎంఈవోలు శ్రీదేవి, నమఃశ్శివాయ, ఎక్సైజ్ డీఎస్పీ కృష్ణకిశోర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ,సీఐ మహేశ్వర్,సీడీపీవో కృష్ణవేణిలతో కూడిన కమిటీ ఆర్డీవో నేతృత్వంలో శనివారం పాఠశాల వద్దకు చేరుకుంది. కొత్తూరు గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఉన్నతాధికారులు మాట్లాడి ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.వారి వద్ద స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.కొందరు విద్యార్థుల దురుసు ప్రవర్తన కారణంగా జరిగిన సంఘటనలపై అధికారులు దృష్టిసారించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆర్డీవో మాట్లాడుతూ రెండు రోజులుగా జరిగిన సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.ప్రవర్తనాలోపం వున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించడం జరుగుతుందని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా పాఠశాలలో తరగతులు జరిగేలా చూసే బాధ్యత తనదన్నారు.పాఠశాలలో ఏ సంఘటన జరిగినా ప్రధానోపాధ్యాయులే చూసుకోవాలని సూచించారు.కొత్తూరు గ్రామంలోకి వెళ్లి దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పాఠశాలలో చేపట్టిన విచారణాంశాలను పూర్తిగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేత్రదానం



సుబ్బరాయులు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శనివారం సూళ్లూరుపేట పట్టణం వత్రపాలెం గ్రామానికి చెందిన ఎగుముదురు సుబ్బరా యులు(82) మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి ఎన్నిక

కోట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సలహా మండలి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండే కమిటీలో షేక్ బాబు, దారా ప్రమీల, దామవరపు బాలసుబ్రహ్మణ్యం సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో వేణు, డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ రూప ఈ కమిటీని ప్రకటించారు.

తడ తహసీల్దారుకు అవార్డు

తడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి) జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తడ తహసీల్దారు శరత్‌బాబుకు ఉత్తమ అవార్డు దక్కింది. ఓటర్ల నమోదు, క్లైమ్‌లను సత్వరమే పరిష్కరించినందుకు జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.





రైల్వేగేటు మూసివేయడంతో నిరీక్షిస్తున్న వాహనదారులు - గేటు దక్షిణం వైపున రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు

గేటేస్తే అర్ధగంట ఆగాల్సిందే

రైల్వే అండర్ బ్రిడ్జి లేక ప్రజల అవస్థలు

సూళ్లూరుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వే గేట్ వాహన చోదకులు, పాదచారులకు సహనానికి పరీక్ష పెడుతోంది. పట్టణానికి తూర్పు, పడమర దిక్కులకు నడిబొడ్డున రైల్వేగేట్ ఉండటంతో ప్రజల రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే గేటు తూర్పు వైపున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రి, షార్ ఉద్యోగుల కాలనీ, పడమర వైపున వ్యాపార దుకాణాలు, మార్కెట్, ఆర్టీసీ బస్టాండు ఉండటంతో ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం బజారుకు రావాలంటే ఈ మార్గంలో రాకపోకలు సాగించాలి. తరచూ రైల్వే గేటు వేస్తుండడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. పాదచారులు వెళ్లాలన్న ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు పెరగడంతో ప్రతి ఐదు నిమిషాల కొకసారి గేటు వేస్తుండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఒక్కొక్కసారి గేటు పడితే 20 నిమిషాల నుంచి అర్ధ గంటకు పైగా తెరుచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో మార్గం లేకపోవడంతో అత్యవసరమైనా సరే నిరీక్షించక తప్పని పరిస్థితి నెలకొంది. మూడేళ్ల క్రితం సదరన్ రైల్వే ఆధ్వర్యంలో రైల్వేగేట్ ఉన్న ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు పనులు కూడా ప్రారంభించారు. అయితే అడ్డంకులు ఎదురవడంతో అర్ధాంతంగా పనులు ఆగిపోయాయి. అండర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఇబ్బందులు తొలగి పోతాయనుకున్న పట్టణవాసులకు రైల్వే గేటు ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికి తోడు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి తెచ్చిన భారీ సిమెంట్ దిమ్మెలు గేటుకు దక్షిణ వైపున వెళ్లే రోడ్డులో అడ్డంగా పెట్టడటంతో అటువైపు ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. రైల్వే అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలగించడంతో పాటు అండర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఓటు హక్కు సద్వినియోగంతో ఉజ్వల భవిత





గూడూరులో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహసీల్దారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ - చిల్లకూరులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది

గూడూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును సద్వినియోగం చేసకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు, ఉత్తమ బీఎల్‌వోలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి, టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు చంద్రశేఖర్, బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, డీటీ సంధ్య, ఆర్ఐ రాజగోపాల్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌వీ వెంకటశర్మ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కళాశాల నుంచి షార్ వైజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు రాజు, సుబ్రహ్మణ్యం, శంకర్ పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానం నుంచి తహసీల్దారు రాజేంద్ర, కమిషనర్ ఫజులుల్లా, అధికారులు, విద్యార్థులు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

ఓజిలి: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు పద్మావతి, డీటీ మధుసూదన రాజు, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఖలీల్ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, ఆర్ఐ సంతోషీబాయి, ఏఎస్‌వో మోహన్‌రావు, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, సుధాకర్, రమణయ్య, తేజ, మోబీనా పాల్గొన్నారు.

చిట్టమూరు: తహసీల్దారు విజయలక్ష్మి, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో చిట్టమూరులో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నబలరామయ్య, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడ: మండలంలోని తడ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను తహసీల్దారు శరత్‌బాబు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోట: మండల కేంద్రమైన కోటలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

డక్కిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను, ఓటరు జాబితా తయారీలో ప్రతిభ కనబరిచిన రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. డక్కిలిలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎస్ఐ శివశంకర్, సర్వేయర్ రాజగోపాల్, ఆర్ఐ ప్రియాంక, వెంకటగిరి అంగన్‌వాడీ అధికారిణి సంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న తహసీల్దారు కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను తహసీల్దారు శ్రీనివాసులు సన్మానించారు. కార్యక్రమంలో గిద్దలూరు రమణయ్య, బాలాజీ, బూడతాటి శ్రీనివాసులు, మల్లికార్జునరావు, లక్ష్మీనారాయణ, తరుణ్, రాజు, కుమార్ యాదవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే కురుగొండ్ల సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి - నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకుంటున్న జయరాజ్ గోపాల్

టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ

నాయుడుపేట టౌన్, వెంకటగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల జయరాజ్‌గోపాల్ టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. నాయుడుపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్ష్యంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యతం స్వీకరించారు. వారివెంట టీడీపీ నాయకులు పెసల కిషోర్‌బాబు, రమేష్‌బాబు, పేరం రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు. అలాగే వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి రూ.లక్ష చొప్పున చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. వారిని కురుగొండ్ల రామకృష్ణ అభినందించారు.

పర్యావరణానికి హానికలిగించే కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్ వద్దు



ప్లాంట్ వద్ద ఒద్దిగుంటకండ్రిగ గ్రామస్తుల నిరసన

నాయుడుపేట టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే కాంక్రీట్ ప్లాంట్ తమ గ్రామంలో వద్దంటూ ఒద్దిగుంటకండ్రిగ గ్రామస్తులు నిరసన తెలిపారు. మండలంలోని ఒద్దిగుంటకండ్రిగ ఎస్టీకాలనీ సమీపంలో నిర్మిస్తున్న కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్ వద్ద శనివారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. కాలనీ సమీపంలో కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్ నిర్మిస్తే ఇబ్బందులు ఉంటాయని, అధికారులు స్పందించి నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎంపిక

నాయుడుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భగత్ రవి ఆధ్వర్యంలో శనివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వరప్రసాద్, కార్యదర్శి మనోజ్, ఉపాధ్యక్షులుగా పార్థసారథి, రిషీ, జగదీష్, సహ కార్యదర్శులుగా సుమన్, సంజాయ్, పృథ్వీ, అశోక్‌కుమార్, గణేష్‌ను ఎంపిక చేశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ

గూడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల దినోత్సవం సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గూడూరులోని ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి శివగంగ ప్రతిభచాటి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. ఎన్నికల ప్రాధాన్యతను తెలియజేసేందుకు 'నథింగ్ లైక్ ఓటింగ్ ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో శివగంగ ప్రథమ బహుమతిని పొందాడు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ సుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాడు.

సామంచికి సన్మానం

నాయుడుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులును నాయుడుపేట బీజేపీ నాయకులు సత్కరించారు. శనివారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో సామంచిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి ఒల్లకాయల విజయభాస్కర్, న్యాయవాది చెంచుకృష్ణయ్య, దువ్వూరు మధురెడ్డి, పుట్టు సూరిబాబు పాల్గొన్నారు.



సామంచి శ్రీనివాసులును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు విజయభాస్కర్, చెంచుకృష్ణయ్య, మధురెడ్డి, సూరిబాబు

కోట ప్రభుత్వాస్పత్రికి రుక్మిణమ్మ పేరు: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కోట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రికి స్థలదాత అల్లారెడ్డి రుక్మిణమ్మ పేరు పేడుతామని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో రూ.13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్కానింగ్ మెషిన్‌ను, ఇతర పరికరాలను శనివారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల ప్రజలకు వైద్యసేవలు అందించే కోట ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే తన లక్ష్యమని. అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో మార్చురీకి ప్రత్యేక గది, ఫ్రీజర్ బాక్సు లేనికారణంగా ఇబ్బందులు పడుతున్నామని వైద్యాధికారులు రూప, డోమ్ ప్రియారావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఫ్రీజర్ బాక్సును తన తండ్రి స్వర్గీయ పాశిం పెంచలయ్య పేరుతో విరాళంగా ఇస్తామని, అలాగే పోస్టుమార్టం చేసేందుకు ప్రత్యేక గది నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, తీగల సురేష్‌బాబు, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మస్తాన్‌బాషా, షంషుద్దీన్, దారా సురేష్, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: డీఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వృత్తి విద్యా కోర్సుల్లో ప్రావీణ్యం పొంది ఆర్థిక స్వాలంబన సాధించాలన్నారు. 24 ఏళ్లుగా సునీత సేవాసంస్థ మహిళలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తూ తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, శిక్షకురాలు జ్యోతి, రూపా, విశ్రాంత ఇంజనీర్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



యువతకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 25: రక్తదానం... ప్రాణదానంతో సమానమని టీఎంఆర్ సంస్థల అధినేత మనోహర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని శనివారం శ్రీవేమ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 73మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది మధుసూదనరావు, నిర్మల, కృష్ణవేణి, కళాశాల సిబ్బంది రంజిత్‌రెడ్డి, జితేంద్రరెడ్డి, సురేంద్ర, సన్ని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తల్లిదండ్రులే తొలి గురువులు

సూళ్లూరుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తొలి గురువులు తల్లిదండ్రులేనని టైనీటాట్స్ పాఠశాల కరస్పాండెంట్ వేనాటి ధనుంజయరెడ్డి అన్నారు. శనివారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, విజయబాబురెడ్డి, భాస్కర్‌రాజు, హరి, వేనాటి వినయ్‌రెడ్డి, ఆరణి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో ధైర్యంగా ముందుకెళ్లాలి

వెంకటగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ధైర్యంగా ముందుకు సాగాలని 9వ బెటాలియన్ కమాండెంట్ అరుణ్‌బోస్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు విపత్తుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

'తల్లికి వందనం' అమలు చేయండి

వెంకటగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి అన్నారు. శనివారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల వద్ద ఈనెల 28న జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్, వెంకటేష్, శ్రీహరి, సుదర్శన్, అఖిల్, సురేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


ఏర్పేడులో మానవహారం చేపడుతున్న అధికారులు, విద్యార్థులు

ఏర్పేడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం నుంచి ఏర్పేడు కూడలి వరకు తహసీల్దారు భార్గవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కూడలిలలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో సౌభాగ్యం, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఏర్పేడు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాపానాయుడుపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నంద్యాల వెంకటమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలసి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్‌ను సన్మానించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంఈవో రవీంద్రనాథ్, ఆర్ఐ నల్లయ్య, సీనియర్ సహాయకులు నాగరాజు రెడ్డి, వీర్వోలు, పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పలువురు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తహసీల్దారు రాజశేఖర్, డీటీ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ మల్లికార్జున, ఆర్ఐ శివకుమార్, వీఆర్వోలు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట జిల్లా పరిషత్ బాలుర పాఠశాల నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్‌కు సన్మానం చేశారు. తహసీల్దారు సురేష్‌బాబు, ఎంఈవో ఇంద్రాదేవి, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధని, ఎస్ఐ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో మానవహారం నిర్వహించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని నినదించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, ఆర్ఐ కరుణాకర్, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులో డీటీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి విద్యార్థులతో ర్యాలీగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కార్యాలంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, ఎంఈవో 2 ఉష, ఆర్ఐ సురేష్, డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్యామ్యూల్, దాస్ కళాశాల ప్రిన్సిపల్ పరంధామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం ఎల్‌ఐసీ కాలనీ సమీపంలో ఉన్న సెయింట్ జేవియర్స్ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నమూనా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉపాధ్యాయులు నాయకులుగా, అధికారులుగా ఉండి విద్యార్థుల చేత ఓటు వేయించి అవగాహన కల్పించారు. ఎక్కువ ఓట్లు వచ్చిన ఉపాధ్యాయుడు మనోజ్‌కు ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లి బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణవనం: నారాయణవనంలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ జయరాములు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరకుల పంపిణీ


బాధితురాలు కార్తీకకు నగదు, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పిచ్చాటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెప్పాలపట్టులో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం రెవెన్యూ అధికారులతో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరకులు, రూ.8 వేలు నగదు అందించారు. బాధితురాలు కార్తీక ఇద్దరు పిల్లలను చూసి ఎమ్మెల్యే చలించి పోయారు. ప్రమాదం నుంచి బయటపడ్డ బాధిత కుటుంబానికి ఇంటి జాగాతో పాటు పక్కా గృహం మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్ర నాయుడు, రవి, వాసు, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి

నారాయణవనం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని వెలసినా పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుడి ఆలయంలో శనివారం ఏకాదశి సందర్భంగా ఉభయ నాంచురులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయనాంచారులతో స్వామివారిని మాడవీధులలో ఊరేగించారు. ఏకాదశి కావడంతో భక్తులు ఉపవాస దీక్షతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 28న జాబ్‌మేళా

సత్యవేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ శాఖల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసిటీలోని వీల్స్ ఇండియా, బ్లూస్టార్, ఏరియాస్ ఆగ్రో తదితర కంపెనీలకు సంబంధించిన ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన యువతీ యువకులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 94403 74535, 94914 58910 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేశారు. మూడు రోజుల క్రితం శ్రీకాళహస్తి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో శనివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వర్ణముఖి నదిలో ఖననం చేశారు.

మోడల్ స్కూల్‌గా రాజులకండ్రిగ పాఠశాల

ఏర్పేడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నకుమార్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా 65మందికి పైగా విద్యార్థులు పాఠశాలలో ఉన్నందున మోడల్ స్కూల్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఘనత సాధించడంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు రత్నకుమార్, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాబిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

కేవీబీపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆదివారం నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థినులు, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందచేస్తామని ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జడ్పీ పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండా ఎగురవేయాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 25(ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. సరుకులు, బియ్యం, కూరగాయలను పరిశీలించి, వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఎంఈవో రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని సూళ్లూరుపేట డీఎల్‌డీవో జాలిరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 పంచాయతీలలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన సర్వేను పూర్తి చేసి ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఈవోపీఆర్‌డీ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించడం తగదు

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించిడం తగదని శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ శివారు ప్రాంతాలైన వాటర్‌హౌస్ కాలనీ, బృందమ్మ కాలనీ, తుఫాన్ సెంటర్ తదితర ప్రాంతల్లో తనిఖీ చేశారు. అలాగే రాత్రి వేళల్లో బహిరంగంగా మద్యం సేవించే మరికొన్ని ప్రాంతాలపై నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వాహనాలు నడపాలని శ్రీకాళహస్తి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు శనివారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలను ఎక్కువ సంఖ్యలో ఆటోలో తీసుకెళ్లరాదన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి ఆటో నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. రోడ్డుపై ఎవరికైనా ప్రమాదాలు జరిగితే వారిని ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు గోపి (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పరిధిలో తడుకు గ్రామం వద్ద శనివారం రాత్రి 8 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానిక కథనం మేరకు.. తిరుపతికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి రోడ్డుపై పడి ఉండటాన్ని గుర్తించామన్నారు. మృతుడు నారాయణవనం సముదాయం గ్రామానికి చెందిన ఈశ్వరరావు తనయుడు గోపి అని తెలిపారు. తిరుపతిలో ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి మెడికల్ షాపుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతుడికి పాప, బాబు ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ వ్యాఖ్యలు దుర్మార్గం

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గ శ్రమశక్తిని మరింత దోపిడీ చేసేలా కనీసం సెలవులు కూడా లేకుండా గొడ్డు చాకిరి చేయించుకోవాలని ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు గుడ్లూరు భారతి అన్నారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాల కారణంగా 8 గంటల పని విధానం అమలవుతోందన్నారు. కార్మిక వర్గాన్ని దేశభక్తి లేనివారిగా ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కార్మిక వర్గ వ్యతిరేక చర్యలను సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు.శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు లీడర్లు తుమ్మల కల్పా, శోభ, శాంతకుమారి, వసంతమ్మ పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం రోజైన ఆదివారం మద్యం, మాంసం విక్రయాలు నిషేధమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో కలిసి శనివారం హోటల్ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఆదివారం మాంసపు విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో వ్యాపారులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఇప్పటికే కెమెరాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపార కేంద్రాల వద్ద రోడ్డు వైపున దృశ్యాలు కూడా రికార్డు అయ్యేలా కెమెరాల దిశలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నారాయణవనం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం బాగుంటుందని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వెత్తలతడుకు ఏఏడబ్ల్యూలో 104 ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం వంటి రోగాలకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం పద్మావతి, ఆశావర్కర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మాయ..

- వెలుగులోకి రోజుకో అవినీతి భాగోతం!
- తాజాగా ప్రైవేటు అపార్ట్‌మెంటుకు సీసీ రోడ్డు నిర్మాణం
- లెక్కతేలని పంచాయతీ నిధులు


కరకంబాడి పంచాయతీలో గొల్లపల్లికి వెళ్లే మార్గంలో పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

రేణిగుంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలు రోజుకొక్కటి చొప్పున వెలుగు చూస్తున్నాయి. ప్రైవేటు వెంచర్‌కు విద్యుత్ టవర్ అడ్డంకిగా ఉన్నా ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మించిన విషయం వెలుగుచూడగా.. తాజాగా మరో భాగోతం బయటకొచ్చింది. ఏకంగా రూ.20లక్షలు వెచ్చించి ఒక ప్రైవేటు అపార్ట్‌మెంటుకు సీసీ రోడ్డు నిర్మాణం చేసిన విషయం దుమారం రేపుతోంది. మండలంలోని కరకంబాడి పంచాయతీలో గొల్లపల్లికి వెళ్లే ప్రధాన మార్గంలోని ఓ అపార్ట్‌మెంటుకు ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. 2021వ సంవత్సరంలో ఈ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రామాంజనేయరెడ్డి స్పెషలాఫీసర్ పాలనలో పంచాయతీ నిధులు రూ.20లక్షలు వెచ్చించి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేయించినట్లు చెబుతున్నారు. అప్పట్లో ఈ విషయం వివాదానికి దారితీయగా బయటకు రాకుండా అధికార బలంతో తొక్కిపెట్టారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికే ఇక్కడ విధులు నిర్వహించిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు రికార్డులు అందించకపోవడంతో నగదు జమ, ఖర్చుల లెక్క తేలడం లేదు. ఆ రికార్డులన్నీ మాయం చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో కరకంబాడి పంచాయతీలో జరిగిన అవకతవకల నేపథ్యంలో డీఎల్పీవో ప్రభురెడ్డి ఇక్కడ పనిచేసిన కార్యదర్శులకు నోటీసులు ఇచ్చారు. ఇప్పటివరకు దాని గురించి ఎవరూ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అలాగే సూరప్పకాశం పంచాయతీలో రూ.1.30కోట్ల నిధులు దుర్వినియోగంపై ఈవోపీఆర్డీని విచారణాధికారిగా నియమించి నెలలు గడుస్తున్నా ఆ విచారణ ఇంకా కొనసాగుతోంది. అలాగే రేణిగుంట పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి త్రీమెన్ కమిటీతో విచారణ చేయిస్తామని చెప్పి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఆ చర్యలు శూన్యం. ఇప్పటికైనా వివిధ పంచాయతీల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చేసి కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- సినీ ఫక్కీలో ఛేజింగ్
- ఫలించిన పోలీసుల ప్రయత్నం

రేణిగుంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పోలీసుల విస్తృత తనిఖీలు.. ఆపకుండా దూసుకుపోయిన వాహనాన్ని వెంబడించిన పోలీసులు.. మధ్యలో ఎదురొచ్చిన.. అడ్డొచ్చిన వాహనాలను ఢీకొంటూ బీభత్సం.. అయినా డీఎస్పీ చిరంజీవి, సీఐ సునీల్‌కుమార్ పట్టుదలతో వెంబడించారు. ఆఖరికి వాహనాన్ని పట్టుకున్నారు. విచారిస్తే అందులో ఉన్నవారు దోపిడీ దొంగలుగా తేలింది. సినీఫక్కీలో సాగిన ఈ ఉత్కంఠ భరిత సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళం ప్రాంతంలోని ఆర్టీవో కార్యాలయ సమీపంలో డీఎస్పీ చిరంజీవి, సీఐ సునీల్ కుమార్ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతి వైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనం నిలిపినా ఆపకుండా వేగంగా దూసుకుపోయింది. అనుమానంతో ఆ వాహనాన్ని పోలీసులు వెంబండించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఆ వాహనం అతివేగంలో ఎదురుగా, అడ్డుగా వచ్చిన ప్రతి వాహనాన్ని ఢీకొంటూ బీభత్సం సృష్టించింది. అయినా సీఐ వెంబడిస్తూనే తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐతోపాటు రేణిగుంట పోలీసులు కూడా ఆ వాహనాన్ని వెంబడించారు. ఆఖరికి రేణిగుంట చెక్‌పోస్టు కూడలి కరకంబాడి వద్ద రోడ్డుకు పోలీసుల వాహనాలను అడ్డుపెట్టి దిగ్బంధించారు. చాకచక్యంగా వాహనంలోని దొంగలు పారిపోకుండా పట్టుకుని ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుబడిన నలుగురిలో సుధాకర్ అనే వ్యక్తి గజదొంగ అని, ఇతడు హైదరాబాద్‌లో అనేక చోరీలకు పాల్పడగా, అక్కడి పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన వారిలో ఇద్దరు తెలంగాణా వ్యక్తులు కాగా ఒకరు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

సత్యవేడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి):రామ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బిలీవ్ ఎఫెక్ట్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు శరవణ ఆధ్వర్యంలో ఎస్ఐ రామస్వామి, ఎంఈవో రవి చేతుల మీదుగా విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందించారు. హెచ్ఎం గీత, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీ అవగాహన పెంచుకోవాలని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. పట్టణంలోని ఉపకారాగారాన్ని శనివారం ఆయన సందర్శించారు. బెయిల్, ఉచిత న్యాయం, చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏ సమస్య ఉన్నా అర్జీరూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ మహిళాధ్యక్షురాలిగా ప్రవల్లిక



శ్రీకాళహస్తి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ పట్టణ మహిళాధ్యక్షురాలిగా దాసరి ప్రవల్లిక ఎన్నికయ్యారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా దాసరి ప్రవల్లికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, డేవిడ్, మునిలక్ష్మి, రాధమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో ప్రైవేటు ఉద్యోగిని హవా

- 10ఏళ్లుగా పుత్తూరులోనే తిష్ఠ
- తిరుపతి మహిళా ప్రాంగణం పోస్టుకోసం పైరవీలు

పుత్తూరు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు, వడమాలపేట మండలాలకు సీడీపీవోగా ప్రైవేటు వ్యక్తిని నియమించడం విమర్శలకు తావిస్తోంది. చాలాకాలంగా కార్యాలయానికి రాకుండా కింది స్థాయి సిబ్బందిని మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చివరకు గుట్టు రట్టు కావడంతో అనారోగ్యం సాకుగా చూపి సెలవులో వెళ్లినట్లు సమాచారం. పుత్తూరు, వడమాలపేట మండలాల్లో 129 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఇక్కడ పనిచేసే రెగ్యులర్ సీడీపీవోను రాజకీయ ఒత్తిళ్లతో పంపించి సదరు వ్యక్తి కొలువుదీరినట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగుతూ విధులకు డుమ్మా కొట్టేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరేళ్లుగా ఆమె వస్తున్నారా.. లేదా.. అని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆరోపణలు తన దృష్టికి రావడంతో ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆమెను మందలించినట్లు సమాచారం. ఈ కారణంగానే ఆమె సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది. తిరిగి పుత్తూరులో విధులు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తిరుపతి రూరల్ పరిధిలోని మహిళా ప్రాంగణానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. రెగ్యులర్ సీడీపీవో నియామకం ద్వారా ఇలాంటి వాటిని అరికట్టవచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులుంటేనే చెక్‌పోస్టు నిర్వహణ: డీఎస్పీ

రేణిగుంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు మార్గంలో ఉన్న చెక్‌పోస్టును శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో అనధికారిక చెక్‌పోస్టు ఏర్పాటుపై వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఈ పరిశీలన జరిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని విచారించి వివరాలను సేకరించారు. అయితే ప్రభుత్వం తరపున చెక్‌పోస్టు ఏర్పాటు చేయటానికి ఇచ్చిన అనుమతులను చూపించి నిర్వహించాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతవరకు ఈ మార్గంలో వాహనాలను నిలపడానికి వీలులేదని తేల్చిచెప్పారు. సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ్ దివస్

వరదయ్యపాళెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు డిల్లీప్రకాష్ అధ్యక్షతన సంవిదాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని శనివారం పార్టీలకు అతీతంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేలూరు సూర్యనారాయణ, బొర్రా మధుసూదన్, గోవర్ధన్, ధన, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.